




## (గత సంచిక తరువాయి)

5

**బొమ్మలా** నిలబడిపోయిన పవిత్ర దగ్గరకి వచ్చి, నేలమీద బోర్ల పడిన కుర్చీ పైకి ఎత్తి సరిగా పెడుతూ అన్నాడు మోహన్ "నువ్వు మోయగలవనేనా మోసుకొస్తున్నావు. నేను వచ్చి తీసుకునేవాడినిగా. కాల్మీద పడిందా? దెబ్బ తగిలిందా?" ఆమె పాదం వైపు చూస్తూ మార్దవంగా అడిగాడు.

ఇంకో సమయం అయితే, పెడసరంగా సమాధానం చెప్పేదేమో, కానీ ఆ క్షణంలో అతనితో కలిసి అక్కడికి ప్రవేశించిన ఆ ఆరడుగుల అందగాడిని చూడడంతో ఆమె తనువు, నిండుగా పూచిన పూలకొమ్మలా పరిమళించింది. సిగ్గుబరువుతో తలవాల్చుకుని లేదన్నట్టు తలాడించింది.

"డాక్టర్ గారికి ఓ సారి చూపిద్దువుగాని రా" అంటూ కుర్చీ తీసుకుని నాంచారమ్మ పడుకున్న మంచం దగ్గరకి నడిచాడు.

"డాక్టర్ గారు వచ్చారా నాయనా?" నాంచారమ్మ మూలుగుతూ అడిగింది.

"వచ్చారు బామ్మా!" అంటూ ఆవిడకి సమాధానం చెప్పి, డాక్టర్ వైపు చూసి, మర్యాదగా ఆహ్వానించాడు. "రండి డాక్టర్. కూర్చోండి. వీరే బామ్మగారు పెరట్లో జారిపడ్డారు. పాపం బాగా గట్టిగా దెబ్బ తగిలినట్టు ఉంది. బాధతో గిల,గిలలాడుతున్నారు ఓర్చుకోలేకపోతున్నారు." అన్నాడు మోహన్.

"అలాగా! ఏమ్మా ఎలా పడ్డారు? ఏదీ కొంచెం పక్కకి తిరగండి." ఆవిడ మీద చేయేసి మృదువుగా అన్నాడు.

"నాయనో నా వల్లకాదు బాబూ. నెప్పి, నెప్పి" అని గట్టిగా అరవసాగింది ఆవిడ. .

"నేనున్నా కదా కంగారు పడకండి. ఓసారి చూడనివ్వండి. ఎక్కడ తగిలింది? బోర్లా పడ్డారా? వెల్లకిలా పడ్డారా?"

"కూలబడ్డాను... మూట విసిరేసినట్టు పడ్డాను. నూతి గట్టు తలకి తగిలింది... నడుం విరిగింది" అందావిడ.

"అరె తలకి తగిలిందా? చూడనివ్వండి." తలమీద చేయి పెట్టి వెలుగునీడల సమ్మేళనంలా ఉన్న ఆవిడ జుట్టులోకి చేయి పోనిచ్చి నెమ్మదిగా నొక్కుతూ అడిగాడు.

మృదువుగా నొక్కుతూ “ఎక్కడ నెప్పి? ఇక్కడ? ఇక్కడ? “ అంటూ అడుగుతోంటే ఆవిడ అడ్డంగా తలూపింది. అక్కడక్కడా నెప్పిగా అనిపించినా తలకి మాత్రం పెద్దగా దెబ్బలు తగల్లేదు అనుకుంటూ స్టెతస్కోప్ తీసి ఆవిడ గుండెల మీద పెట్టాడు.

అతని చర్యలు, అతని మాటలు పవిత్రకి కొత్తగా, వింతగా ఉన్నాయి, కానీ ఆ కొత్తదనంలో, వింతలో ఏదో గమ్మత్తు. తనకు తెలిసిన మగవాళ్ళలో లేని ఠీవి అతనిలో… ఎవరి స్వరంలోనూ వినని మత్తు ఆ స్వరంలో ఉన్నాయి. అతని స్వరం గంభీరంగా, మార్దవంగా ఉంది. మనిషి చామనచాయ అయినా ఆకర్షణీయంగా ఉన్నాడు. ముఖ్యంగా అతని కళ్ళు చిన్నవే అయినా, అందంగా అనిపిస్తున్నాయి. మాట్లాడుతున్నప్పుడు ఆ కళ్ళల్లో గమ్మత్తైన నవ్వు చిందులేస్తోంది. ఆ నవ్వులో అల్లరి… చిలిపిదనం. అచ్చు అక్కినేని క్రాఫ్ లా నొక్కులుగా ఉంది.

మోహన్ వెనక్కి తిరిగి ఆమెని చూస్తూ పిలిచాడు “రా పవిత్రా”

మధురస్వప్నం భగ్నం చేసినట్టు అనిపించి కోపంగా చూసింది అతని వైపు.

“డాక్టర్ గారు బామ్మగారిని పరీక్షిస్తున్నారు. నువ్వలా దూరంగా ఉంటే ఎలా?” సంజాయిషీగా అన్నాడు మోహం ఆమె మొహంలో చికాకు గమనించి.

“ఈమెకి తనంటే ఎందుకింత చికాకు?” అనిపించింది మోహన్ కి.

నిలుచున్న చోటు నుంచి కదిలింది పవిత్ర. కుడి పాదం కలుక్కుమంది. కిక్కురుమనకుండా నెమ్మదిగా కుంటుతూ వచ్చి, అక్కడే కొంచెం ఎడంగా వంటగది గుమ్మం దగ్గర నిలబడి, డాక్టర్ శివరామకృష్ణ వైపు రెప్పవాల్చకుండా చూడసాగింది.

“బామ్మగారూ! కొద్దిగా పక్కకి ఒత్తిగిలగలరా?” అడిగాడు శివరామకృష్ణ.

“అమ్మో! నెప్పి” అందావిడ.

“నడుంకి బాగా తగిలినట్టు ఉంది డాక్టర్” అన్నాడు మోహన్ సందేహంగా.

“చూద్దాం… ఆవిడ పక్కకి తిరిగితే చూడచ్చు తిరగలేకపోతున్నారు కదా… ఎవరన్నా సాయం చేయండి మనమే తిప్పుదాం” అంటూ తలెత్తి, ఎడమచేతి కింద నుంచి ఓణీ చెంగు కుడి చేతి వేళ్ళకి చుట్టుకుంటూ ఓరగా తననే గమనిస్తున్న పవిత్ర వైపు చూసాడు.

అతని దృష్టి తనమీద పడగానే తొలకరి జల్లుకి పులకించిన పుడమి అయింది ఆమె తనువు. కలవరంగా కళ్ళు వాల్చేసుకుంది.

“నేను సాయం చేస్తాను” మోహన్ నాంచారమ్మ మంచం దగ్గరగా నడిచి ఆవిడ మీద చేయేసి, “బామ్మగారూ! కొద్దిగా ఎడం పక్కకి తిరగండి.” అన్నాడు.

ఆవిడ బలవంతంగా తిరగబోయి కెవ్వుమంది. “ నాకాలు నెప్పి బాబోయ్” అంటూ.

ఆ అరుపుకి పవిత్ర గాభరా పడుతూ, గబుక్కున కదిలి ముందుకు అడుగువేయబోయి, పరికిణీ కాలికి తగిలి ముందుకు తూలింది. “అయ్యో! అయ్యో! నెమ్మదే పడేవు” నీరసంగా అంది నాంచారమ్మ.

మోహన్ నాంచారమ్మని వదిలేసి వేగంగా ఆమె వైపు పరిగెత్తినట్టు వెళ్లి ఆమె పడకుండా భుజాలు పట్టుకుని ఆపాడు.

అప్పటివరకు ఏం జరుగుతోందో స్పృహ లేనిదానిలా ఉన్న పవిత్ర మోహన్ చేయి తన భుజాల మీద పడగానే విసురుగా అతని చేయి తోసేసి నాలుగు అంగల్లో నాంచారమ్మ దగ్గరకి వచ్చి “నానమ్మా నువ్వు ఇటు తిరుగు నావైపు.. డాక్టర్ గారు పరీక్ష చేస్తారు” అంటూ ఆవిడ నడుం మీద చేయేసి తిప్పడానికి ప్రయత్నించింది. కానీ, సాధ్యం కాలేదు.

ఆమె తన చేయి విసురుగా తోసేయడంతో చిన్నబుచ్చుకున్న మోహన్ కొద్ది క్షణాలు నిలబడిన చోటే స్తబ్దుగా ఉండిపోయాడు. కానీ, అక్కడ తన కర్తవ్యం వేరే ఉందన్నస్పృహ కలిగిన వాడై, తిరిగి మంచం దగ్గరకు వచ్చాడు. .

పవిత్ర అవసరం లేదు నేను తిప్పుతాను అని అంటున్నా పట్టించుకోకుండా మరో వైపు నుంచి నెమ్మదిగా నాంచారమ్మని పక్కకి తిప్పడంలో పవిత్రకి సాయం చేసాడు. నాంచారమ్మని తిప్పడం తనకి అసాధ్యం అని తెలిసినా, బింకంగా ప్రయత్నించబోవడంతో కుడిచేయి నెప్పిగా అనిపించడంతో మోహన్ సహాయం తిరస్కరించలేకపోయింది.

మూలుగుతున్న నాంచారమ్మతో “కాసేపు ఓపిక పట్టు డాక్టర్ గారు చెకప్ చేస్తున్నారు.” అంది.

డాక్టర్ ఆమె వైపు అభినందనగా చూసి, ప్రశంసిస్తున్నట్టు చిన్నగా నవ్వాడు.

ఎవరు నేర్పారు నీకింత మధురంగా నవ్వడం? ఎవరు చల్లారీ నవ్వులో మంచి గంధం?

సిగ్గుతో కందిన చెంపలను ఒత్తైన జుట్టు ఓ పక్కనుంచి జారి, ఆ ఎరుపు అతని కంట పడకుండా కప్పేసింది.

నాంచారమ్మ వీపు మీద స్టెతస్కోప్ ఆనించబోయిన డాక్టర్ ముగ్ధమనోహరమైన పవిత్ర రూపాన్ని కొన్ని క్షణాలు మైమరచిపోయి చూసాడు. ఆ చూపులకి కలవరపడిన పవిత్ర గబుక్కున ఆవిడని వదిలేసింది.

నాంచారమ్మ కెవ్వుమంది.

డాక్టర్ సర్దుకుని పవిత్రవైపు చూడకుండా “పట్టుకోండి... పరీక్ష చేస్తాను” అన్నాడు.

పవిత్ర కంపిస్తున్న చేతులతో ఆవిడ నడుము గట్టిగా పట్టుకుంది.

ఫుల్ హ్యాండ్ షర్టు, దాని మీద తెల్లని కోటు, మెడలో స్టెతస్కోపు, అతన్నలా చూస్తుంటే పవిత్రకి చాలా గొప్పగా అనిపించసాగింది. బలిష్టంగా ఉన్న అతని చేతులు ఒక్కసారి తాగితే!

వెంటనే తనని తాను తమాయించుకుని ఆవిడ నాడు మీద మాత్రం దృష్టి పెట్టింది.

ఆవిడ కాళ్ళ మీద నొక్కుతూ ‘ఇక్కడ నొప్పిగా ఉందా బామ్మగారూ! ఇక్కడా?’ అంటూ ప్రశ్నలు వేస్తోంటే ఆవిడ మూలుగుతూ మాట్లాడలేదు.

‘సరే ఇక్కడ’ అన్నాడు చేయి మోకాలు మీద పెట్టి ఆవిడ కెవ్వుమంది.

రెండో కాలు కూడా నొక్కుతూ కొంచెం తనవైపు జరుపుకోడానికి ప్రయత్నిస్తుండగా, పవిత్ర సాయం చేయడానికి రెండు చేతులూ ఆవిడ కాలు మీద వేసింది. అప్పుడే అతని చేయి ఆమె కుడిచేతి మీద పడింది.

ఆమె అణువణువూ సవరించిన వీణ తీగ అయింది. ఓ మధురమైన నాదం గుండెల్లో ప్రతిధ్వనించింది. కంపిస్తున్న అధరాలు గట్టిగా పై పంటితో నొక్కిపట్టి, తల వంచుకుని, నాంచారమ్మని పరీక్ష చేయడంలో అతనికి సహకరించసాగింది.

దాదాపు ఏడాదిగా పవిత్రని చూస్తున్న మోహన్ కి, తను డాక్టర్ ని తీసుకుని గది లోపల అడుగుపెట్టిన దగ్గర నుంచి, ఆమె మొహంలో కలుగుతున్న భావాలు అర్థం అవసాగాయి. ఇదే భావోద్వేగం తను ఆమెని చూసిన మొదటిరోజు అనుభవించాడు. అంటే! అంటే! అతని గుండెల్లో ముళ్ళు గుచ్చుకుని, చివ్వున రక్తం ఎగజిమ్మినట్టు అయింది.

ఎంతపని చేసాను? ఇతన్ని తీసుకువచ్చి తప్పు చేసాను. తనది అనుకున్న పవిత్ర... ఇంత త్వరగా అతని వైపు ఆకర్షించబడిందా? ఇదేనా ప్రేమంటే! పవిత్ర ఇంక తన మొహం కూడా చూడదు. పవిత్రా! బాధగా మూలిగింది మనసు.

జీవితంలో మొదటిసారి తనమీద తనకి అసహ్యం వేసింది. దేవుడి మీద కోపం వచ్చింది. తనని ఇంత నల్లగా ఎందుకు పుట్టించాడు... ఎంతో కష్టపడి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, పదిలంగా తెచ్చుకున్న హిమసుమాన్ని డాక్టర్ శివరామకృష్ణ దోచుకుపోతున్నట్టు నిస్సహాయంగా మనసులో రోదిస్తూ, నిలుచున్న చోటే శిలలా ఉండిపోయాడు.

డాక్టర్ స్వరం వినిపిస్తోంది. "బహుశా కాలు ఫ్రాక్చర్ అయినట్టుంది. మీ నాన్నగారు వచ్చాక ఓ సారి నా క్లినిక్ కి రమ్మని చెప్పండి. ప్రస్తుతం నెప్పి తగ్గడానికి టాబ్లెట్స్ ఇస్తున్నాను. ఇప్పుడు ఒకటి వేయండి. రేపు ఉదయం ఒకటి..." పవిత్రకి చెప్పి, నాంచారమ్మని అడిగాడు. "మీకు బ్లడ్ ప్రెషర్, షుగర్ వ్యాధి ఉన్నాయా"

"లేవు నాయనా. సలక్షణంగా తింటూ తిరుగుతున్నాను. వారానికి రెండు సినిమాలు హాయిగా చూస్తున్నాను. ఇవాళే పూజాఫలం వెళ్దామే అన్నాను నా తల్లితో... ఖర్మగాలి పడ్డాను. నా గ్రహచారం బాలేదు" ఆవిడ రుద్ధస్వరంతో అంది.

"వెళ్ళచ్చులెండి సినిమాకేం! ఎప్పుడైనా చూడచ్చు. పదిరోజులు మంచం దిగకండి. తరవాత వెళ్ళచ్చు" నవ్వుతూ అన్నాడు.

"పదిరోజులు మంచం దిగద్దా? ఏం? కాలిరిగిందా? " ఆదుర్దాగా అడిగింది.

"మీ అబ్బాయి వచ్చాక నా దగ్గరకు రమ్మనండి మాట్లాడతాను. ఒకసారి ఎక్స్ రే తీసి చూస్తే తప్ప తెలియదు. కంగారేం లేదు తగ్గిపోతుంది. పదిరోజులు మాత్రం రెస్ట్ కావాలి. కొత్త సినిమా వచ్చిందని వెళ్ళకండి. రిలీజ్ అయిన సినిమాలు మళ్ళీ, మళ్ళీ రిలీజ్ అవుతూనే ఉంటాయి."

అతను మాట్లాడుతూ ఉండగానే కారు ఆగిన శబ్దం వినిపించింది.

"అమ్మా, నాన్నొచ్చారు" గట్టిగా అంది పవిత్ర.

"వచ్చాడా? వచ్చేసాడా? మాధవుడు వచ్చాడా? ఒరేయ్ మాధవా నా కాలిరిగిందిరా..." ఒక్క పెట్టున రాగం మొదలుపెట్టింది నాంచారమ్మ.

అప్పటివరకు మూలుగుతున్నా, అంతో, ఇంతో మామూలుగానే మాట్లాడుతున్నఆవిడ అలా రాగం మొదలు పెట్టడంతో పవిత్ర బిత్తరపోయింది.

ఇప్పుడు నాన్న వస్తే తప్పకుండా తనని తిడతారు. “నువ్వే బామ్మని బలవంతం చేసి ఉంటావు సినిమా, సినిమా అని. అయినా తలనెప్పిగా ఉందని చెప్పి, సినిమాకి ఎందుకు బయలుదేరావు?” అని తిడతారు అని ఆలోచిస్తూ, బెదురుగా గుమ్మం వైపు నడిచింది.

ముందుగా తల్లిని చూడగానే, పవిత్ర కళ్ళల్లో అప్రయత్నంగా గిర్రున నీళ్ళు తిరిగాయి. అందుకు కారణం ఆమెకే తెలియదు. నానమ్మ పడిందనా? సినిమాకి వెళ్ళలేకపోయినందుకా? లేక శివరామకృష్ణని చూసిన తరవాత కలిగిన భావోద్వేగమా?

నాంచారమ్మ శోకాలు, కూతురు కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళు, తెల్లమొహం వేసుకుని చూస్తున్న మోహన్, మరో అపరిచిత వ్యక్తిని చూస్తున్న ఆవిడకి ఏమి అర్థం కాలేదు. “ఏం జరిగింది?” అడిగింది అయోమయంగా.

“నానమ్మ పడింది.” రుద్ధమైన స్వరంతో చెప్పింది పవిత్ర.

“ఏంటి? అమ్మ పడిందా? ఎలా? ఎక్కడ?” వెనకాలే వచ్చిన మాధవశర్మ కంగారుగా అడుగుతూ అక్కడ ఉన్న అందరివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ, వేగంగా నాంచారమ్మ పడుకున్న మంచం దగ్గరకి వచ్చి, ఆవిడ వైపు ఒంగి “ఏమ్మా? పడడం ఏంటి? ఎలా పడ్డావు? ఎక్కడ పడ్డావు? దెబ్బలు బాగా తగిలాయా” అంటూ ప్రశ్నల వర్షం కురిపించసాగాడు.

పవిత్ర గుండె గుబగుబలాడింది. నానమ్మ చెప్పేస్తుందా? చెప్పేస్తుందా? సినిమాకి వెడదాం అందిరా పవిత్ర... మొహం కడుక్కుందామని వెళ్లాను. జారి పడ్డాను...

“పెరట్లో ఆరిన బట్టలు తెద్దామని వెళ్లానురా... కాలు జారి పడ్డాను”

హమ్మయ్య గట్టిగా ఊపిరి పీల్చుకుంది. అబద్ధం చెప్పి తనని రక్షించిన నానమ్మ వైపు ప్రేమగా చూసింది. నానమ్మ ఎంత మంచిది? అసలు విషయం చెబితే నాన్న తిడతారని ఆవిడకి తెలుసు కాబట్టి అంత బాధలోనూ అబద్దం చెప్పింది.

నానమ్మకి తనంటే ఎంత ప్రేమ! తన మీద ఈగ వాలనివ్వదు. పవిత్ర మనసులో నానమ్మ పట్ల అంతులేని కృతజ్ఞత వెల్లివిరిసింది.

వర్ధని పవిత్ర వైపు చూసింది. వాళ్ళిద్దరూ వెళ్ళేటప్పుడు పవిత్ర పడుకుని ఉంది. ఇప్పుడు చక్కగా ముస్తాబు అయి ఉంది.

ఆవిడకి అర్థం అయింది. బామ్మ, మనవరాలు కలిసి ఏదో ప్రణాళిక వేసుకున్నారు అనుకుంది.

“పాపం ఈ కుర్రాడు అప్పటికప్పుడు వెళ్లి, ఇరుగో డాక్టర్ గారిని పిలుచుకు వచ్చాడు. ఇతను కాలు విరిగింది అంటాడు ఏంటో నాకర్థం కావడం లేదు. ఏం నాయనా నువ్వు డాక్టరీ చదివావా? మా రావుడులా పుస్తకంలో చూసి ఇస్తావా మందులు“ అంది డాక్టర్ వైపు చూస్తూ.

అతను నవ్వాడు. ఆవిడ భావం అర్ధం అయింది. అతను రాకముందు రామారావు అనే కంపౌండర్ తనని తాను పెద్ద డాక్టర్ గా భావించుకుంటూ తనే అన్ని వ్యాధులకి మందులిచ్చేవాడని అతను విని ఉన్నాడు. అందుకే ఆవిడ మాటలకి నొచ్చుకోలేదు. నవ్వుతూ "నేను ఎం బి. బి. ఎస్ పాసై గవర్నమెంట్ డాక్టర్ గా వచ్చానమ్మా ఇక్కడికి" అన్నాడు.

మాధవ అతని వైపు చూసి, "ఓ గతవారం కొత్త డాక్టర్ ఎవరో వచ్చారు అనుకున్నారు అందరూ. మీరేనా... చాలా సంతోషం మీ పరిచయం అవడం... అని పవిత్రవైపు చూసి, "కనీసం డాక్టర్ గారికి మంచినీళ్ళన్నా ఇచ్చావా?" అని అడిగాడు.

పవిత్ర లేదన్నట్టు తల ఊపింది.

"అదేంటిరా ఇంటికి వచ్చిన వాళ్లకి మంచినీళ్ళు ఇవ్వద్దూ. వెళ్లి కాఫీ, మంచి నీళ్ళు పట్రా"

"పర్లేదండి... ఆవిడ కాలికి దెబ్బ తగిలింది పాపం నడవలేకపోతోంది" అన్నాడు డాక్టర్ సానుభూతిగా.

"కాలికి దెబ్బా? ఏంటి? నువ్వు కూడా పడ్డావా?" కంగారుగా అడిగాడు మాధవ.

"లేదండి... డాక్టర్ గారి కోసం లోపల నుంచి కుర్చీ తెస్తూ కంగారుపడి కుర్చీ వదిలేసింది. అది తన కాలిమీద పడింది." అన్నాడు మోహన్.

"అయ్యో... ఏదీ ఇలారా కాలు చూపించు" ఆయన ఆప్యాయంగా పిలిచాడు కూతురుని.

శివరామకృష్ణ తండ్రి,కూతుళ్ళను ఆసక్తిగా గమనించసాగాడు.

"ఏమి తగల్లేదు నాన్నా. బానే ఉన్నాను. కాఫీ తెస్తాను." అంటూ పవిత్ర నెమ్మదిగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. ఆమె వెనకాలే వర్ధని కూడా వెళ్ళింది.

"నేను కలుపుతానమ్మా కాఫీ." అంది పవిత్ర.

"నీ మొహం. నువ్వు కాఫీ కలపడం వాళ్ళు తాగడం. సరేలే జరుగు నేను కలుపుతాను." ఆవిడ పవిత్రని వారించి డికాషన్ గిన్నెలో పోసి, పాలగిన్నె స్టవ్ మీద పెట్టింది.

"నేర్చుకుంటానమ్మా. ఎప్పుడూ తిడతావుగా పని నేర్చుకోను అని"

"ఇప్పుడే తీరిందా నీకు. అతనసలె కొత్తవాడు. నీ ప్రయోగాలు ఇప్పుడెందుకు? రేపెప్పుడన్నా నేర్చుకోలే" అందావిడ కాఫీ కప్పుల్లో పోస్తూ.

"నేను ఇస్తాను. మంచినీళ్ళు కూడా ఇవ్వమన్నాడు నాన్న" అంటూ చిన్న ట్రే లో మంచినీళ్ళ గ్లాసు పెట్టి కప్పు తీసుకుని మరో పక్క పెట్టుకుని ట్రే తీసుకుని వెళ్తోన్న కూతురువైపు చిత్రంగా చూస్తూ అనుకుంది వర్ధని. "దీనికేదో అయింది."

"పరిస్థితి ఏంటి డాక్టర్?" అడిగాడు మాధవ.

"ఫ్రాక్చర్ అని అనుమానంగా ఉంది సార్. రేపు ఎక్స్ రే తీయించాలి. నెప్పి తగ్గడానికి మాత్రలు ఇచ్చాను. రేపు కొంచెం ఆవిడ కదలగలిగితే ఎలాగోలా క్లినిక్ కి తీసుకురండి" అన్నాడు.

"ఈ పరిస్థితిలో ఆవిడ రాగలదా ? చూద్దాం" అన్నాడు మాధవ సాలోచనగా.

మౌనంగా ఒక మూల నిలబడిన మోహన్ వైపు మాధవ దృష్టి పడింది.

"చాలా శ్రమ ఇచ్చాము మోహన్ నీకు. నువ్వు సమయానికి రాకపోతే ఏమయేదో. ఆవిడని లేపి మంచం మీదకి చేర్చి, డాక్టర్ ని తీసుకువచ్చావు." అన్నాడు అతన్ని ఆప్యాయంగా చూస్తూ.

"పర్లేదండి. ఇరుగుపొరుగు అన్నాక అవసరానికి సాయం చేయకపోతే ఎలా?" అన్నాడు.

పవిత్ర ట్రే లో మంచి నీళ్ళ గ్లాస్ కాఫీ కప్పు పెట్టుకుని వచ్చింది.

పవిత్ర తడబడుతున్న అడుగులతో అతనికి దగ్గరగా వచ్చి ట్రే అతని ముందు పెట్టింది. అతను చిరునవ్వుతో ఆమెవైపు చూసాడు. ఆమె గుండె ఝల్లుమంది. మనోహరమైన ఆ నవ్వు మదనుడి విరిబాణంలా ఆమె గుండెల్లోకి దూసుకువెళ్ళి కన్నె మనసులో కల్లోలం రేపింది.

"కాఫీనా?" ఏదో ఒకటి మాట్లాడాలి అన్నట్టు అసందర్భ ప్రశ్న వేసాడు. ఆమె కలవరపడుతూ తల ఊపింది.

ట్రే నుంచి కాఫీ కప్పు తీసుకుని మరోమారు ఆమె కళ్ళల్లోకి చూసి "థాంక్స్ " అంటూ నవ్వాడు.

ఆమె చేతిలో ట్రే వణికింది. గిరుక్కున తిరిగి, తడబడుతున్న అడుగులతో వంటగదివైపు వెళ్తున్న ఆమె తండ్రి పిలుపుతో మంత్రించినట్టు ఆగిపోయి వెనక్కి తిరిగింది. " మోహన్ కేది కాఫీ" అడిగాడు ఆయన.

ఆ ప్రశ్నకి పవిత్ర మోహన్ వైపు చూసింది ఆ చూపులు "ఏంటి నీక్కూడా కాఫీ కావాలా?" అన్న హేళన కనిపించింది అతనికి.

ఆమెతో కాకుండా మాధవకి చెబుతున్నట్టుగా "పర్వాలేదండి నాకు అలవాటు లేదు" అన్నాడు మోహన్.

"నీకలవాటు లేకపోవడం ఏమిటి? మీ అమ్మ నీకు కాఫీ అంటే చాలా ఇష్టం అని చెప్పింది. ఇదిగో తీసుకో" అంటూ మోహన్ కి కాఫీ కప్పు అందించింది వర్ధని.

"వద్దండి" మొహమాటంగా అన్నాడు మోహన్.

"తీసుకోవయ్యా అంత మొహమాటపడతావేం?" ఆవిడ బలవంతంగా అతని చేతికి కాఫీ కప్పు ఇచ్చి, నాంచారమ్మ మంచం దగ్గరగా వెళ్లి ఆవిడ వైపు ఒంగి అడిగింది. "మీరేమన్నా తాగుతారా అత్తయ్యా మజ్జిగ కానీ, బత్తాయి రసం కానీ ఇవ్వనా?" అని అడిగింది.

"నాకేం వద్దే ముందు ఈ నెప్పి తగ్గాలి". అందావిడ నీరసంగా.

"నెప్పి తగ్గిపోతుంది ఉదయానికి. కాస్త ఓపిక చేసుకుని క్లినిక్ కి రండి. పదిరోజుల్లో లేచి పూజాఫలం సినిమాకి వెళ్ళచ్చు" అన్నాడు శివరామకృష్ణ నవ్వుతూ.

వర్ధని కూడా నవ్వి “పాలు తెస్తాలెండి వేడిపాలు తాగండి.” అంటూ తిరిగి వంటగదివైపు వెళ్ళింది.

పవిత్ర కూడా ఆవిడ వెనకాలే వెళ్ళింది.

“వెళ్లొస్తాను. రేపు ఆవిడ రాలేకపోతే నేనే వస్తాను” అంటూ లేచాడు శివరామకృష్ణ.

“నేను మీతో వస్తాను డాక్టర్ గారూ” అంటూ ఆయన చేతిలో మెడికల్ కిట్ అందుకున్నాడు మోహన్.

మాధవ లేచి వాళ్ళిద్దరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపి గుమ్మం దాకా వెళ్లి సాగనంపాడు.

అయ్యో వెళ్ళిపోతున్నాడా? మెరుపులా వచ్చి మాయమైతే ఎలా? నేనేం కావాలి? పవిత్ర మనసు విలవిల్లాడింది.

వంటగది కిటికీలో నుంచి వీధి గేటు కనిపిస్తుంది. అక్కడ నిలబడి, వెళ్తున్న శివరామకృష్ణని చూస్తూ ఉంటే తన గుండె అతని చేత్తో పట్టుకుని వెళ్తున్నట్టు అనిపించింది పవిత్రకి.

చీర మార్చుకోడానికి మరోగదిలోకి వెళ్ళిపోయింది వర్ధని.

మోహన్, శివరామకృష్ణ వెళ్ళిపోయినా గేటు మాత్రం ముందుకీ, వెనక్కీ ఊగుతూనే ఉంది పవిత్ర మనసులా.

మొదటిసారి చూసినా, అతన్ని ఎప్పటినుంచో బాగా ఎరిగిఉన్న వ్యక్తిలా అనిపిస్తున్నాడు. ఇంతకు ముందు ఇతన్ని ఎక్కడో చూసాను... చూడడమే కాదు, ఎన్నో అనుభూతులు పంచుకున్నాను... ఎక్కడ? ఎక్కడ కలిసాను? ఎప్పుడు చూసాను?

ఆలోచిస్తోంది.

కలలోనా? కాలేజి గేటు ముందా? సినిమా హాల్లోనా? ఎక్కడ? ఎక్కడ?

హృదయంలోనా? కనురెప్పల మీదా?

పెదవి చివరకు జారిన చిరునవ్వు కాంతిలోనా?

ఎక్కడ? ఎక్కడ?

“ఏం చేస్తున్నావిక్కడ? పిలిస్తే పలక్కుండా” వర్ధని స్వరం విని ఉలికిపడింది.

“ఏం లేదు... కాలు నెప్పిగా ఉంటేనూ “ నసిగింది.

“మరి డాక్టర్ కి చూపించకపోయావా? ఏదీ దెబ్బ తగిలిందా చూడనీ...” వర్ధని ఒంగి పవిత్ర పాదం మీదకి వేలాడుతున్న పరికిణీ కొద్దిగా తొలగించి చూసింది.

పచ్చని పాదం కొద్దిగా ఎర్రగా అయింది. కొద్దిగా వాచింది.

ఏం తగల్లేదులే. కొంచెం వాచింది. కొబ్బరినూనె రాసుకుని కాపడం పెట్టుకో తగ్గిపోతుంది. అవునూ. మేము బయటకి వెళ్ళేటప్పుడు, తలనొప్పి అని జడ కూడా వేసుకోకుండా పడుకున్నావు. హటాత్తుగా ఎక్కడికి వెళ్లి వచ్చావు ముస్తాబైనావు? అనుమానంగా అడిగింది వర్ధని.

గతుక్కుమంది పవిత్ర. కానీ వర్ధని కళ్ళల్లో కనిపిస్తున్న నవ్వు చూసాక ధైర్యం వచ్చి, " నానమ్మే అంది పూజాఫలం సినిమాకి వెళ్దాము తయారవు అని... అందుకే"

"అదా సంగతి... ఆవిడ కూడా ఆ హడావుడిలో పడిందనమాట. బాగుంది మీ ఇద్దరి భాగోతం."

"నేనేం అడగలేదు" బుంగమూతి పెట్టి అంది పవిత్ర.

ఆవిడ నవ్వేసి "వెళ్ళు, వెళ్లి బట్టలు మార్చుకుని రా" అంది.

పవిత్ర తన గదిలోకి వెళ్ళిపోయింది. బట్టలు మార్చుకోబోతూ ఎదురుగా నిలువుటద్దం చూసింది.

ఇదేమిటి? తనిలా ఉందేంటి? అది పవిత్ర కాదు, ఎవరో రెండు చేతులతో సుతారంగా పట్టుకుని వస్తున్న మల్లెల హారం... అబ్బా! ఎంత మత్తుగా ఉందీ పరిమళం! హారం తనవైపు వస్తోందేంటి? గుబాళిస్తున్న మల్లెలు తన మెడని అలంకరిస్తున్నాయి... ఎవరది? ఎవరి చేతులు తన మెడని తాకి గిలిగింతలు పెడుతున్నాయి... తమకంతో కళ్ళు మూసుకుంది.

నడుం మీద మెత్తటి స్పర్శ... ఉలిక్కిపడింది. తనకి తెలియకుండానే మంచం మీద వెల్లకిలా వాలడంతో తగిలిన పరుపు. సిగ్గుతో అరచేతుల్లో మొహం దాచుకుంది.

డాక్టర్ శివరామకృష్ణ... తను శివా అని పిలవచ్చు. శివ... శివ ఎంత బాగుంది పేరు! గబుక్కున మంచం దిగి కిటికీ దగ్గరకు నడిచింది వీధి గేటు వైపు తొంగి చూసింది. గేటు కనిపించలేదు. గాలికి ఊగుతున్న మందార కొమ్మ కనిపించింది. తలెత్తి హాయిగా నవ్వుకుంది. పైన నీలాకాశం... చల్లనిగాలి కిటికీలోంచి వలయాలుగా వచ్చి చెంపలని సుతారంగా తాకింది. తెల్లని మబ్బులు గుంపులుగా కదిలి వెళ్తున్నాయి.

"వెళ్ళండి... వెళ్ళండి. శివ దగ్గరకి వెళ్లి పవిత్ర నిన్నే తలచుకుని పరవశిస్తోంది అని చెప్పండి"

అప్రయత్నంగానే తెరలు, తెరలుగా నవ్వొచ్చింది.

రెండు చేతులూ చాచి, గుండ్రంగా తిరుగుతూ పకపకా నవ్వడం మొదలుపెట్టింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS